రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## జిహెచ్ఎంసి శామీర్‌పేట డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల జారీతో హర్షం

**శామీర్‌పేట, డిసెంబరు 26, ప్రభాతవార్త**

జిహెచ్ఎంసి శామీర్‌పేట డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ కావటంతో స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శామీర్‌పేట మండల కేంద్రాన్ని జిహెచ్ఎంసి శామీర్‌పేట డివిజన్‌గా గుర్తించటంతో స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శామీర్‌పేట గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు తూంకుంట డివిజన్‌ను శామీర్‌పేట డివిజన్‌గా గుర్తించాలని కోరటం ప్రభుత్వం స్పందించి శామీర్‌పేటను డివిజన్‌గా మార్చటంతో పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసిలోని మల్కాజ్‌గిరి జోనల్‌లో కీసర సర్కిల్‌లో శామీర్‌పేట డివిజన్‌గా ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడటంతో పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శామీర్‌పేట మండల కేంద్రంలో ఉన్న సౌకర్యాలను గుర్తించి జిహెచ్ఎంసి శామీర్‌పేట డివిజన్‌గా చేయటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## సెలవులతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ



**ఘట్‌కేసర్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** వరుస సెలవులు రావడంతో ఆర్టీసీ బస్సుల్లో విపరీతమైన రద్దీ నెలకొంది. గురు, శుక్ర, ఆదివారాలు మూడు రోజుల పాటు సెలవులు ఇవ్వడంతో జనాలు పల్లె బాట పట్టారు. దీంతో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో రద్దీగా తిరుగుతున్నాయి. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండటంతో పెద్ద సంఖ్యలో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు క్రిస్మస్, వరుస సెలవుల నేపథ్యంతో తమ సొంత గ్రామాలకు పయనమయ్యారు. సెలవుల రాకతో మహిళలు తమ పిల్లలు, బంధువులతో కలిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని మేడారంతో పాటు ఇతర ప్రాంతాలకు విహారయాత్రలకు బయలు దేరారు. ఘట్‌కేసర్ చౌరస్తా బస్‌టెర్మినల్‌లో ప్రయాణికుల రద్దీ ఏర్పడింది. నగరం నుంచే అన్ని బస్సులు నిండుగా వస్తుండటంతో ఇక్కడ వేచి చూస్తు రద్దీగా ఉన్నప్పటికి బస్సుల్లో ఎక్కుతున్నారు. ఘట్‌కేసర్‌లోని హస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లడంతో నిత్యం కిటకిటలాడే బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్, హోటళ్లు బోసిబోయాయి. మేడారం, యాదగిరిగుట్ట, వరంగల్, మహబూబాబాద్ తదితర ప్రాంతాలకు బస్సుల్లో వెళ్తున్నారు. శనివారం తిరుగు ప్రయాణంతో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, వరంగల్ జిల్లాల నుంచి వచ్చే బస్సులు ప్రయాణికులతో రద్దీగా మారాయి.

## జిహెచ్ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా బాధ్యతలు

..జోనల్ కమిషనర్‌గా బదిలీ..జిల్లాకు ఇక ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా యధావిధిగా కొనసాగింపు

...పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 26, ప్రభాత వార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని జిహెచ్ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఆమె ఉప్పల్‌లోని జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌గా రాధికగుప్తా బాధ్యతలు స్వీకరించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేయటంతో ఆమెను జిహెచ్ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా బదిలీ చేసింది. అయితే జోనల్ కమిషనర్‌గా కొనసాగుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా రాధికగుప్తా కొనసాగనున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొంది. జిహెచ్ఎంసిలో 12 జోనల్ కార్యాలయాలను ఏర్పాటు చేయటంతో వాటికి ఐఏఎస్ అధి కారులను జోనల్ కమిషనర్‌లుగా నియమించారు. దీంతో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వ హి స్తున్న రాధికగుప్తాను జిహెచ్ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా నియ మించారు. బదిలీ ఉత్తర్వులు జారీ కావటంతో ఆ వెంటనే జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అదనంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీస్)గా రాధికగుప్తా కొన సాగనున్నారు.ఆమెకు ఉప్పల్ జోనల్ కార్యాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.



మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా జిహెచ్ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన

## పెట్రోల్ బంకుకు తప్పిన పెనుప్రమాదం

..అన్నోజిగూడ వద్ద ఘటన

.. నడుస్తున్న మారుతి వ్యాన్‌లో మంటలు

..అప్రమత్తమైన బంకు సిబ్బంది



.పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ వద్ద నడుస్తున్న మారుతి వ్యాన్‌లో మంటలు చేలరేగగా ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పుతున్న దృశ్యం.





.అన్నోజిగూడ వద్ద మారుతి వ్యాన్‌లో మంటలు చేలరేగి పెట్రోల్ బంకులోకి దూసుకుపోవడంతో మంటలు ఆర్పుతున్న బంకు సిబ్బంది.

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 26, ప్రభాత వార్త:** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల భారత్ పెట్రోల్ బంక్‌కి ఘోర ప్రమాదం తప్పింది. వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారిపై అన్నోజిగూడ వద్ద సర్వీస్ రోడ్డుపై వెళ్తున్న ఓమ్ని మారుతి వ్యాన్‌లో మంటలు చేలరేగాయి. వ్యాన్ నాగారం నుండి అన్నోజిగూడ వైపు సర్వీస్‌రోడ్డులో ప్రయాణిస్తుండగా ఆకస్మాత్తుగా మంటలు చేలరేగాయి. దీంతో వ్యాన్ డ్రైవర్ పెద్దపల్లి రాజు వ్యాన్ స్టీరింగ్ వదిలేసి కిందకు ప్రక్కకు దుకాడు. డ్రైవర్ కిందకు దూకిన తర్వాత జోరందుకున్న మంటలతో వ్యాన్ ముందుకు రోడ్డు ప్రక్కనే గల భారత్ పెట్రోల్ బంకులోకి వెళ్లింది. దీంతో అప్రమత్తమైన బంకు సిబ్బంది వ్యాన్‌పై నీళ్లపోసి మంటలను ఆర్పివేశారు. బంకులోకి వెళ్లి ఆగిన మండుతున్నవ్యాన్ కారణంగా బంకుకు మంటలు అంటుకుంటే పెద్ద ప్రమాదమే జరిగేది. అన్నోజిగూడకు చెందిన పెద్దపల్లి రాజు ఏదో పని నిమిత్తం నాగారంకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. మంటలకు దగ్గమైన మారుతి వ్యాన్ ( నెంబరు ఎపి 28 డిసి 0092 ) తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని వ్యాన్‌కు అంటుకున్న మంటలను పూర్తిస్థాయిలో ఆర్పివేశారు. కాగా అప్పటికే వ్యాన్ దగ్ధం అయ్యింది. వ్యాన్‌లో అమర్చిన సిలేండర్ పేలడంతోనే మంటలు అంటుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సీఐ రాజు వర్మ తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత : సిఐ నరహరి



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

**కేశంపేట, డిసెంబరు 26, ప్రభాత వార్త:** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ నరహరి తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఏడు గంటల ప్రాంతంలో పోలీస్ సిబ్బంది పెట్రోల్లింగ్ నిర్వహిస్తున్న సమయంలో కాకునూర్ గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న కాకునూరు గ్రామానికి చెందిన ఇంజ మూరి మహేష్‌ను అనుమతులకు సంబంధించిన పత్రాలు ఉన్నాయని అడగగా ఎలాంటి పత్రాలు లేవని తెలపడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ అశోక్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ నరహరి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని సిఐ నరహరి అన్నారు.

## తూంకుంట డివిజన్ పేరు మార్చవద్దంటూ మొర..

..పార్టీలకు అతీతంగ తీర్మాణం చేసిన నాయకులు

**శామీర్‌పేట,డిసెంబరు 26, ప్రభాత వార్త:** జిహెచ్ఎంసిలో విలీనం అయిన తూంకుంట మున్సిపల్ డివిజన్ పేరును మార్చవద్దంటూ తూంకుంట గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంఠ తీర్మానం చేసినట్లు నాయకులు, యువకులు పేర్కొన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత శాఖల అధికారులకు, కలెక్టర్‌కు వినతిపత్రాలు పార్టీలకు అతీతంగ ఇవ్వటం జరుగుతుందన్నారు. శుక్రవారం తూంకుంటలో పలు పార్టీల నాయకులు సమావేశమై డివిజన్ పేరు మార్చవద్దంటూ తీర్మానం చేశారు. ప్రభుత్వం తూంకుంట మున్సిపాల్టీని ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనం చేసిందని, అయితే జిహెచ్ఎంసిలో 300డివిజన్‌గా తూంకుంటను ప్రకటించారని, అయితే అభ్యంతరాల స్వీకరణలో భాగంగ పలువురు శామీర్‌పేటను 300డివిజన్‌గా పెట్టాలని వినతిపత్రాలు ఇచ్చినట్లు పత్రికల్లో చూశామని, అయితే తీరా శుక్రవారం శామీర్‌పేట 300 డివిజన్‌గా ప్రచురణ జరిగిందని అన్నారు. అయితే తూంకుంట మున్సిపాల్టీలో విలీనమైన శామీర్‌పేట గ్రామం పేరును డివిజన్‌గా ఎలా పెడుతారని వారు ప్రశ్నించారు. తూంకుంట పేరుతో మున్సిపాల్టీగ కొనసాగిందని, ఇపుడు డివిజన్ పేరు మార్చటం ఎంత వరకు సబబు అని వారు అన్నారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదని తూంకుంట డివిజన్‌లోని అన్ని ప్రాంతాలకు కేంద్రంగ తూంకుంట ఉందని అందరికి అనుకూలంగ ఉంటుందన్నారు. ఐదు సంవత్సరాల పాటు తూంకుంట మున్సిపాల్టీగ కొనసాగినట్లు, ఔటర్ రింగురోడ్డు లోపల ఉండటం, జిల్లా కలెక్టరేట్ ఇక్కడే ఉందని, తూంకుంటకు కావలసిన సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. తూంకుంటను డివిజన్‌గా కొనసాగించాలని వారు కోరారు. ఈ విషయంపై సిఎం రేవంత్‌రెడ్డిని, ప్రిన్సిపల్ సెక్రటరీని, ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబును, డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్‌ను, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి తూంకుంటను యధావిధిగా కొనసాగించాలని కోరనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్‌లు సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, బి,రాజుయాదవ్, నాయకులు టిఆర్ రవీందర్‌గౌడ్, నోముల శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.రవీందర్‌గౌడ్, ఎం.దయానంద్, ఆర్.ప్రవీణ్‌గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



తూంకుంట డివిజన్ పేరును మార్చవద్దంటూ పార్టీలకు అతీతంగా మాట్లాడుతున్న వివిధ పార్టీల నాయుల దృశ్యం

## విబిజి రాంజీ బిల్లు రద్దు చేయాలి

**వికారాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** విబిజి రాం జీ బిల్లు వెంటనే రద్దు చేయాలని సిఐటియూ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వికసిత్ భారత్, గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ బిల్లులను రద్దుచేయాలని వారు పేర్కొన్నారు. పని చేసే హక్కు ను కల్పించాలన్న సార్వత్రిక డిమాండ్ ఆధారిత చట్టమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ను రద్దు చేసి దాని స్థానంలో తీసుకువచ్చిన జి రామ్ జి బిల్లు ప్రభుత్వ పథకంగా మాత్రమే ఉంటుందని అన్నారు. చట్టబద్ధమైన హక్కులు కార్మికులు కోల్పోతారని, ఈ బిల్లులో పని డిమాండ్‌కు తగినట్లుగా నిధుల ం కేటాయించాల్సిన బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుంటుందని తెలిపారు. వ్యవసాయ ప నులు ఉధృతంగా వున్న సమయంలో 60 రోజుల వరకు ఉపాధిని సస్పెండ్ చేసేందుకు ప్రభు త్వాల ం అ నుమతిస్తున్న నిబంధన వల్ల అత్యంత అవసరమైన కాలంలో గ్రామీణ కుటుంబాలకు పనుల ం నిరాకరిస్తూ, వారు భూస్వాములపై ఆధారపడాల్సిన పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో డిజిటల్ హాజరు ను తప్పనిసరి చేయడం సరికాదని అన్నారు. వేతనాల చెల్లింపుల కోసం బడ్జెట్లో కేంద్ర రాష్ట్రాలు 60-40 నిష్పత్తిలో పంచుకోవాలన్న ఏర్పాటు ను తీసుకురావడం ద్వారా ఈ బిల్లు కేంద్రం బాధ్యత ను తగ్గిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విబి-జిఆర్ఎఎంజి బిల్లు ను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య, రైతుసంఘం జిల్లా నాయకులు ఆర్.మహిపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యూ.బుగ్గప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ,కోశాధికారి బుస్స చంద్రయ్య, నాయకులు సుదర్శన్, సత్యయ్య, ఎండి.హబీబ్, ఉపసర్పంచ్ రఘురామ్, లాలయ్య పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

## జోరుగా కలప అక్రమ రవాణా

..జిల్లా సరిహద్దులు దాటిస్తున్న వ్యాపారులు

..బొగ్గు బట్టీలకు విలువైన వృశాల చేరవేత

..వాల్టాకు తూట్లు పొడుస్తున్న అక్రమార్కులు

..మామూళ్ల మత్తులో అటవీశాఖ అధికారులు

..వనమహోత్సవం లక్ష్యం నెరవేరేనా...

**కుల్కచర్ల, డిసెంబరు 26, ప్రభాతవార్త:** మండలంలో ఒక్కశాతం ఉన్న అటవీ ప్రాంతాన్ని 33 శాతం వరకు పెంచాలనే ఉద్దేశంతో అటు అధికారులు... ఇటు ప్రజలు కృషి చేస్తుంటే.. అక్రమ సంపాదనకు అలవాటుపడిన కొందరు. అక్రమార్కులు ఉన్న చెట్లను యథేచ్ఛగా నరివేస్తున్నారు.ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో ఏటా కోట్లాది రూపాయలు ప్రజాధనం ఖర్చు చేస్తుంటే..అటవీశాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పలువురు అధికారులకు ప్రతి నెలామూడులు ముట్టచెబుతున్నామనే ధీమాతో అక్రమార్కులు విలువైన కలపను జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు.ఉమ్మడి కుల్కచర్ల మండలాల నుంచి నిత్యం కలప రవాణా జోరుగా సాగుతుంది.అటవీ ప్రాంతంలోని టేకు, వేప, తుమ్మ,చింత చెట్లను దర్జాగా నరికివేస్తు లారీల ద్వారా చుట్టుపక్కల ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉమ్మడి మండలాల వ్యాప్తంగా 15 మంది కలప వ్యాపారులు ఉండగా.వీరికి ఏజెంట్లుగా 30 మందికి పైగా పనిచేస్తున్నట్లు సమాచారం.

**మామూళ్లు ఎవరికి..?**

కలప అక్రమ రావాణాపై అటివీశాఖ అధికారులపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దందా సాగిస్తున్న వ్యాపారుల నుంచి నెల నెలా మామూళ్ల పుచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది.అధికారులు, కలప వ్యాపారులు చేతులు కలపడంతో వారి సంపాదన మూడు పువ్వులు... ఆరుకాయలుగా వర్ధిల్లుతోందనే ప్రచారం జరుగుతుంది. ఉన్నతాధికారులకు అనుమానం రాకుండా..అప్పుడప్పుడూ తూతూ మంత్రంగా కేసులు నమోదు చేస్తూ..పెద్ద ఎత్తున కలపను పక్క జిల్లాలకు దాటిస్తున్నట్లు సమాచారం.కొన్ని చెట్లకోసం అనుమతి తీసుకుంటున్న సదరు వ్యక్తులు విలువైన కర్రను అందులో ఉపయోగిస్తున్నారని తెలుస్తుంది.ఇంతా జురుగుతున్నాఆ అక్రమ కలప రావాణాను అరికట్టేందుకు అటవీశాఖ అధికారులు తీసుకున్న చర్యలు మాత్రం శూన్యంగా కనిపిస్తున్నాయి. ఈ విషయంలో అధికారులు మేలకోకుంటే..భవిష్యప్రయోజనమేనని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నిల్వచేసిన కలప



పట్టపగలే ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న అక్రమ కలప

**అక్రమ కలప రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం....**

అనుమతులు లేకుండా చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తే నఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ కపల రవాణా చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

ఫారెస్ట్ రెంజర్ అధికారి శ్యామ్ కుమార్.

## జోనల్‌ల ఏర్పాటులో మేడ్చల్ (నియోజకవర్గంలో) 'మేడ్చల్' పేరు గల్లంతు..?

మేడ్చల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో నాలుగు నియోజకవర్గాలు జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయాలుగా ఏర్పాటు

మిగతా నాలుగు జోనల్‌లోకి వెళ్లిన మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపల్ సర్కిల్స్ కార్యాలయాలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 26, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి కొత్త జోనల్ కార్యాలయాలను ఏర్పాటు చేయటంతో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఉన్న ఐదు నియోజకవర్గాల్లో నాలుగు నియోజకవర్గాల పేర్లతో ఉప్పల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలలో ఆయా చోట్ల నాలుగు జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అయితే జిల్లాలోని ఇక మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపల్ సర్కిల్ కార్యాలయాలను ఆయా నాలుగు జోన్ల పరిధిలోకి విలీనం చేశారు. ఇక మేడ్చల్ జోనల్ కార్యాలయంగా అంటూ లేకుండా పోయి చివరకు 'మేడ్చల్ పేరు' గల్లంతు అయిందని చెప్పవచ్చు. ఇక కేవలం జిహెచ్ఎంసి మేడ్చల్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయంగ మిగిలిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసిలో కొత్తగా జిహెచ్ఎంసి పరిధిలో 12జోనల్ కార్యాలయాలను, 60సర్కిల్ కార్యాలయాలను, 300డివిజన్లను (వార్డులు) ఏర్పాటు చేయటం జరిగింది. ఈ నేపథ్యంలో మేడ్చల్ నియోజకవర్గ కేంద్రంను జిహెచ్ఎంసి మేడ్చల్ జోనల్ కార్యాలయంగా చేస్తే బాగుండేదని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో ఉన్న డివిజన్లను, సర్కిల్స్‌ను మిగతా ఆయా నాలుగు నియోజకవర్గాల్లోని జోనల్ కార్యాలయాల్లోకి విలీనం చేయటం జరిగింది. ఇక మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని శివారు మున్సిపాల్టీలు అన్ని కూడ జిహెచ్ఎంసిలో విలీనం జరిగిన సంగతి తెలిసిందే. జిహెచ్ఎంసి జోన్ల ఏర్పాటులో మేడ్చల్ నియోజకవర్గంకు ప్రాధాన్యత దక్కలేదని ఉన్న సర్కిల్ మున్సిపల్ కార్యాలయాలన్నింటిని కూడ మేడ్చల్ జిల్లా పరిధిలో ఉన్న ఉప్పల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి జోనల్ కార్యాలయాల్లోకి వాటిని చేర్చటం జరిగింది. ఇప్పటికే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పూర్తిగా మున్సిపాల్టీలు జిహెచ్ఎంసిలో విలీనం జరిగింది. ఇక మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని మేడ్చల్ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాల్టీలు మూడుచింతలపల్లి, అలియాబాద్, ఎల్లంపేట్‌లు మాత్రమే జిహెచ్ఎంసిలో కలపకుండ మిగిలిపోయాయి. ఇక మేడ్చల్ జిల్లాలో గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్ అంటూ లేకుండా పోయి స్థానిక ఎన్నికలు కూడ నిర్వహించని సంగతి తెలిసిందే. మరీ మేడ్చల్ జిల్లా పరిధిలో కేవలం జిహెచ్ఎంసికి సంబంధం లేకుండ మూడు మున్సిపాల్టీలు అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మాత్రం మిగిలి ఉన్నాయి. మరీ రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసి ఎన్నికలతో పాటు ఈ మూడు మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహిస్తుందా లేదా అనేది అందరిలో సందేహంగ మారింది. జిల్లాలోని ఆ మూడు మున్సిపాల్టీలు కూడ జిహెచ్ఎంసిలో విలీనం కావచ్చన్న ప్రచారం కూడ జరిగింది. అయితే ఇప్పటికే జిల్లాలోని శివారు మున్సిపాల్టీలను జిహెచ్ఎంసిలో విలీనం చేయటం, జోనల్, సర్కిల్, డివిజన్ కార్యాలయాల ఏర్పాటును గుర్తించినందున ఇక ఆ మూడు మున్సిపాల్టీలకు ప్రత్యేకంగ రాష్ట్రంలోని మున్సిపాల్టీలతో పాటు వీటికి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని చెప్పవచ్చు. జిహెచ్ఎంసి ఎన్నికలు కూడ వచ్చే ఫిబ్రవరి 10వ తేదీతో మేయర్,డిప్యూటీ మేయర్, కార్పోరేట్ల పదవీకాలం ముగియనున్నందున ఆ తరువాతనే ఎన్నికలు జరగవచ్చని స్పష్టం అవుతుంది. మేడ్చల్ జిల్లా ఇప్పటికే గ్రామీణ ప్రాంతంగ ఉన్నప్పటికీ పట్టణ ప్రాంతంగ జిహెచ్ఎంసిలో విలీనంగ కావటం, మేడ్చల్ నియోజకవర్గంలో ఉన్న ఆ మూడు మున్సిపాల్టీలు కూడ పూర్తిగ గ్రామీణ ప్రాంతంగ ఉన్నప్పటికీ మున్సిపాల్టీలుగ చేయటంతో జిల్లాను పూర్తిగ పట్టణ మున్సిపల్ ప్రాంతంగ ప్రభుత్వం చేర్చిందని చెప్పవచ్చు. గతంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఉన్న 61 గ్రామపంచాయతీలు, 5మండల పరిషత్‌లు, 1జిల్లా పరిషత్ అన్ని కూడ రద్దు అయి మున్సిపాల్టీలలో విలీనం చివరకు ఆయా ప్రాంతాలు అన్ని జిహెచ్ఎంసిలోకి వెళ్లాయి. జిల్లాలో మూడు మున్సిపాల్టీలు మాత్రం మిగిలి పోయాయి. మూడు మున్సిపాల్టీల్లో మున్సిపల్ కమిషనర్లతో పాలన కొనసాగుతూ ఉంది.

## క్రీడలతో స్నేహభావం, శరీర దారుఢ్యం: ఎమ్మెల్యే

-జిపిఎల్ సీజన్-2 ప్రారంభం



గురుకుల్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**ఘట్‌కేసర్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** యువత సెల్‌పోన్లు, చెడువ్యసనాలకు లోను కాకుండా క్రీడలలో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని గురుకుల్ మైదానంలో జీపీఎల్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. మల్లారెడ్డి సేవా ట్రస్ట్ సౌజన్యంతో ఘట్‌కేసర్ యువజన సంఘాల ఆధ్వర్యంలలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి విచ్చేసి ప్రారంభించారు. క్రీడాకారులతో కరచాలనం చేస్తూ పరిచయం చేసుకొని టాస్ వేసి బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను ఆరంభించారు. ఫైనల్‌లో గెలుపొందిన జట్టు, రన్నరప్ జట్లకు మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ద్వారా నగదు బహుమతులు, ట్రోఫి అందజేస్తారని తెలిపారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు తమ ట్రస్ట్ ద్వారా సహకారం అందిస్తున్నామని మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, మాజీ డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి, జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ వరిగంటి వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపిటిసిలు మేకల నర్సింగ్‌రావు, దీకొండ రఘు, మంకం రవి, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, బండారి అంజనేయులు, బేతాల నర్సింగ్‌రావు, నిర్వహకులు పల్లె విజయ్‌గౌడ్, సంజయ్‌గౌడ్, ప్రకాష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పూడూర్ కిష్టాపూర్ డివిజన్ పేరుతో గ్రామస్తుల హర్షం

మేడ్చల్, డిసెంబర్ 26. ప్రభాతవార్త : జీహెచ్ఎంసీ కిష్టాపూర్ వార్డు డివిజన్‌ను పూడూర్ కిష్టాపూర్‌గా మార్చినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని కిష్టాపూర్ పేరుకు పూడూర్‌ను చేర్చడం సంతోషాన్ని వ్యక్తం చేస్తూ అందుకు సహకరించిన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌లకు దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనాయణరెడ్డి, పోచయ్య, శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బాబు యాదవ్, స్రవంతి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ రఘు, నర్సింహ, కృష్ణ, హన్మంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శామీర్‌పేట పెద్ద చెరువులో వ్యక్తి మృతదేహం

**శామీర్‌పేట, డిసెంబరు 26, ప్రభాతవార్త** : శామీర్‌పేట పెద్ద చెరువులో నీటిపై ఓ వ్యక్తి మృతదేహంను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం శామీర్‌పేట పెద్ద చెరువులో మృతదేహం నీటిపై తెలి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం సికింద్రాబాద్‌లోని రిజిమెంటల్ బజార్‌కు చెందిన పోచబోయిన వీరేశ్‌యాదవ్ (45) ఈ నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. అతని మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండటంతో అతను కనిపించటం లేదని నగరంలోని గోపాల పురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగ ఆ పిఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారని పోలీసులు తెలిపారు. 26న శుక్రవారం శామీర్‌పేట పెద్ద చెరువులో ఓ వ్యక్తి మృతదేహం నీటిపై తేలి ఆడుతూ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయంపై మృతుడి కుమారుడు జశ్వంత్ యాదవ్‌కు సమాచారం ఇవ్వగా వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఈ మృతదేహం తన తండ్రి పోచబోయిన వీరేశ్‌యాదవ్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉంటూ బాధపడుతూ ఉన్నారని, మద్యానికి అలవాటు పడిన వ్యక్తి అని ఆ కారణాల వల్ల చెరువులో పడిఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై శామీర్‌పేట పోలీసులు విచారణ చేపట్టారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్లంపేట మున్సిపల్ బిజెపి నూతన కార్యవర్గం

**మేడ్చల్, డిసెంబరు 26. ప్రభాతవార్త ః** ఎల్లంపేట మున్సిపల్ బిజెపి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి అమరం మోహన్‌రెడ్డి ప్రకటించారు. మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో నియమించిన ఈ కమిటీ ఉపాధ్యక్షులుగా మేకల్ దేవేందర్‌రెడ్డి, విశ్వశాంతి కొండల్‌రెడ్డి, అప్పాల రాంచందర్, కైరంకొండ మధు, బచ్చు క్రిష్ణప్రియ, బండి నర్సింహ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శులుగా కంచుగంట మహేష్, దాది ప్రకాష్ ముదిరాజ్, కార్యదర్శులుగా రవి బాబు ముదిరాజ్, అంజనేయులు, పెగుడ పద్మారావు, ఆకుల నాగరాజు, చందర్ నాయక్, ఉషిగారి బాబు, కోషాధికారిగా చుక్క సత్యనారాయణ, సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎల్లంపేట మున్సిపల్ బిజెపి పార్టీ పూర్తి కమిటీ ఏర్పాటయిందని తెలిపారు.

## అయ్యప్ప స్వామి మహా సేవ కార్యక్రమం

**మేడ్చల్, డిసెంబరు 26. ప్రభాతవార్త ః** ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావల్‌కోల్ గ్రామంలో అయ్యప్ప స్వామి మహా శావ కార్యక్రమాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. గడీల రాజు గురుస్వామి ఆధ్వర్యంలో భజనలు, పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమ నామస్మరణతో కనుల పండుగగా చేపట్టారు. కార్యక్రమంలో రాము గౌడ్, వెంకటేష్, నర్సింహ గౌడ్, నర్సింహ, ప్రభాకర్, రాహుల్ యాదవ్, మల్లేష్, రమేష్, ప్రశాంత్, నాగులు, కుమార్, దేవేందర్, వెంకటేష్, శ్రీనివాస్, సాయికుమార్ నాగమణి, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


రావల్‌కోల్ గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా శావ కార్యక్రమం

## అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

**కొడంగల్,డిసెంబరు 26. ప్రభాతవార్త ః** కొడంగల్ పట్టణంలోని హైద్రాబాద్ రోడ్డు బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి గాను పట్టణానికి చెందిన అనంతలక్ష్మీ పృధ్వీరాజ్ విరాళాన్ని అందజేశారు.శుక్రవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్,కానుకుర్తి నర్సి రెడి ,రాకేష్,గురుస్వాములు ఉమాపతి గౌడ్ ,బుక్క విజయ్‌కుమార్ ,గోపాల్ ల సమక్షంలో రూ.51వేల నగదును అందజేశారు.అంతకుముందు ఆలయంలో అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు అనంత ప్రసాద్, కానుకుర్తి రమేష్, పకీరప్ప,నరేందర్,అర్గె ఓంప్రకాష్,శ్రీకాంత్,బొంకురు నరేష్, అఖిల్ యాదవ్ , తదితరులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి విరాళాన్ని అందిస్తున్న దృశ్యం

## జీవాలకు నట్టల నివారణ మందును వేయించాలి

**మేడ్చల్, డిసెంబరు 26. ప్రభాతవార్త ః** జీవాలకు నట్టల నివారణ మందును ప్రతి రైతు వేయించాలని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహ్లు యాదవ్ అన్నారు. ఎల్లంపేట మున్సిపల్ పరిధి రావల్‌కోల్ గ్రామంలో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ జీవాలు ఆరోగ్యంగా ఉండాలంటే నట్టల నివారన మందు ముందు జాగ్రత్త చర్యగా వేయించాలని తెలిపారు. గ్రామంలో ఉన్న గొర్రెలు, మేకలకు పశు వైద్యాధికారులు ఉచితంగా వేస్తారని, రైతులు తప్పకుండా ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమురయ్య, గ్రామ సంఘం అధ్యక్షుడు ఆనంద్, పశు వైద్యులు కురుమూర్తి, శోభారాణి,సుధా, శ్రీనివాస్, గ్రామ సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్, సభ్యులు అమృత, నర్సింహ, శ్రీశైలం, మల్లేష్, సాయిలు, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో వికారాబాద్ జిల్లాకు చేసిందేమీ లేదు

- మళ్లీ అధికారం మాదే అంటే ఎట్లా?

- వికారాబాద్ జిల్లా టీజేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వర్

**పరిగి ,డిసెంబరు 26. ప్రభాతవార్త ః** వికారాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గానికి కేటాయిస్తున్న నిధులలో కనీసం 10 అభివృద్ధి నిధులను జిల్లాలోని మిగిలిన పరిగి, వికారాబాద్, తాండూర్ నియోజకవర్గాలకు కనీసం కేటాయించకుండా అభివృద్ధి చేయకుండా ఆ మూడు నియోజకవర్గాలలో గెలుపు అసాధ్యం అయినపుడు రాష్ట్రంలో ఎలా గెలిచి అధికారంలోకి వస్తారని వికారాబాద్ జిల్లా టీజేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వర్ ప్రశ్నించారు.శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి రావడానికి మీరు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కేవలం గత ప్రభుత్వ పెద్దలను విమర్శిస్తే ఓట్లు పడి మళ్ళీ అధికారంలోకి వస్తారా?రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోపే బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగ, ఉపాధి చట్టసభల్లో మీరు ఇస్తామన్న 42 శాతం రిజర్వేషన్ను ఇవ్వకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై నెట్టేసి బీసీలకు అన్యాయం చేస్తే మళ్ళీ అధికారంలోకి ఎట్లా వస్తారు హామీ ఇచ్చేటప్పుడు రిజర్వేషన్ల అంశం కేంద్ర పరిధిలో ఉన్నదని మీకు తెలియదా? బీసీలు అంటే అంత చులకనా వారికి రాజ్యాంగం పై అవగాహన లేదనుకున్నారా?ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన ప్రాణహిత చేవెళ్ల, (కాళేశ్వరం) ప్రాజెక్ట్ రెండవ దశ పనులను చేపట్టకుండా కేవలం గత ముఖ్యమంత్రి గారిని కాళేశ్వరం కూలిందని విమర్శిస్తూ ఇతర పద్ధతుల ద్వారా నైనా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు నీరు ఇవ్వకుండా మీరు అధికారంలోకి ఎట్లా వస్తారు? అన్నారు.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా మొత్తం ఆరు రిజర్వాయర్లలో ఆరవ లక్ష్మీ మ్దేవి పల్లి రిజర్వాయర్ పూర్తి చేస్తామని ఎన్నికల సందర్భంలో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చాక ఇప్పుడు రెండవ ఏదుల రిజర్వాయర్ నుండి డిండి ద్వారా నల్గొండకు నీళ్లు తరలించే విధంగా నిధులు కేటాయించి లక్ష్మీదేవి రిజర్వాయర్ ను తుడిచి పెట్టేసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు అన్యాయం చేస్తున్న మీరు రెండవసారి అధికారంలోకి ఎట్లా వస్తారు? అన్నారు.వికారాబాద్ జిల్లాలో ఇప్పటివరకు జిల్లా, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు బీసీలకు ఇవ్వకుండా జిల్లాలో 60 శాతం ఉన్న బీసీలకు అన్యాయం చేస్తూ రాబోవు ఎన్నికల్లో అధికారంలోకి ఎలా వస్తారు? రాబోవు రెండున్నరేళ్లలోనైనా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను మరియు అన్ని నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి అవసరమయిన నిధులు కేటాయించి సమన్యాయం చేయండి అప్పుడు ప్రజలే ఆలోచిస్తారు మీకు అధికారం ఇవ్వాలో వద్దో అన్ని పేర్కొన్నారు.


వికారాబాద్ జిల్లా టీజేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వం


దేవరయాంజాల్‌లో ఘనంగా జరిగిన క్రిస్‌మస్ వేడుకలు,పాల్గొన్న జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి,పాల్గొన్న తదితరుల దృశ్యం

# ఘనంగా క్రిస్‌మస్ వేడుకలు

..పాల్గొన్న జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి

**శామీర్‌పేట, డిసెంబరు 26, ప్రభాతవార్త** : జిహెచ్ఎంసి తూంకుంట సర్కిల్ మున్సిపల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో క్రిస్‌మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. శామీర్‌పేట మండలం తూంకుంట, దేవరయాంజాల్, శివశివానికాలనీ, పలు ప్రాంతాల్లో క్రిస్‌మస్ పండుగ వేడు కలను క్రైస్తవ సోదర,సోదరీలు ఘనంగా జరుపుకున్నారు. కేక్‌లను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ వార్డుల్లోని చర్చిల్లో ఫాస్టర్లు సూర్య ప్రకాశ్, ఇమాన్యుల్, రాజాధిప్రసాద్, కళ్యాణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో క్రిస్‌మస్ వేడుకలు ఘనంగా కన్నుల పండుగగా నిర్వహించారు. వివిధ చర్చిల్లో జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి పాల్గొని క్రైస్తవ కుటుంబాల వారికి క్రిస్‌మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రిస మస్ పండుగ ప్రేమ, త్యాగం, శాంతి సోదరభావాలకు ప్రతీక అని అన్నారు. అన్ని మతాలు సమానమేనని, పండుగలు సమాజంలో ఐక్యతను, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయన్నారు. రాష్ట్రంలో ప్రజలు సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ మాజీ చైర్మన్ పి. వీరారెడ్డి, మాజీ సర్పంచు గోల్డ్ శ్రీనివాస్, ఆలయ మాజీ ధర్మకర్త పి.నర్సింహ్మారెడ్డి, మాజీ వార్డుసభ్యులు డి.ప్రకాశ్‌గౌడ్, నాయకులు దూసరి మహేశ్‌గౌడ్, నాగిగళ్ల శ్రీనివాస్, పి.శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

..శామీర్‌పేట మండలం, మూడుచింతలపల్లి (మున్సిపల్) ఆయా మండలాల్లో, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్‌మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న చర్చిలకు క్రైస్తవులు వెళ్లి ప్రార్థనలు చేశారు. క్రిస్‌మస్ పండుగను పురస్కరించుకుని చర్చిలను అలంకరించారు. చర్చిల్లో ప్రార్థనలు, భక్తి పాటలతో మారుమోగాయి. క్రిస్‌మస్ సందర్భంగా కేక్‌లను కట్ చేశారు. ఆయా గ్రామాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, క్రైస్తవ సోదర,సోదరీలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచులు చైతన్యవంతులుగా పనిచేసుకోవాలి

తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి మండిపల్ వెంకట్

**చౌడాపూర్, డిసెంబరు 26, ప్రభాతవార్త** : తెలంగాణ రాష్ట్ర సర్పంచ్లుకు తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ తరపున మండిపాల్ వెంకట్ శుభాకాంక్షలు తెలుపుతూ సర్పంచులు రాజకీయాలకు అతీతంగా జనవరిలో మండల, జిల్లా, రాష్ట్ర సంఘాలు ఏర్పాటు చేసుకొని గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం 50 శాతం నిధులు మంజూరు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని,అభివృద్దే ధ్యేయంగా సర్పంచులు పనిచేయాలి అని ప్రెస్ మీట్ ద్వారా తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మండిపాల్ వెంకట్ సర్పంచులను కోరడం జరిగింది. మూడు విడతల పంచాయతీ ఎన్నికలు ఫలితాల అనంతరం రాష్ట్ర కార్యదర్శి మండిపాల్ వెంకట్ మాట్లాడుతూ...మునుపెన్నడూ లేని విధంగా యం.పి,యం.యల్.ఏ ఎన్నికల కు ధీటుగా అభ్యర్థులు గెలుపు కొరకు ఖర్చు చేశారని పల్లెలకు ఇది మంచి పరిణామం కాదని అభిప్రాయ పడ్డారు.దీనివలన అభ్యర్థులు ఆర్థికంగా నష్టపోయి చివరకు కుటుంబాలు వీదిన పడిన దాఖలాలు ఎన్నో ఉదాహరణలు మన కళ్ళముందు కనిపిస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం దీనిని పరిగణలోకి తీసుకోక పోవడం శోచనీయం అన్నారు.గ్రామ అభివృద్దే ధ్యేయంగా, విజయమే పరమావధిగా డబ్బును లెక్క చేయకుండా సర్పంచులు, వార్డ్ మెంబర్స్ ఎంతో ఉత్సాహంగా ఎన్నికలలో పాల్గొన్నారు అని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి మండిపాల్ వెంకట్ అభిప్రాయ పద్దారు.అయితే ప్రభుత్వం దీనిని గమనంలో తీసుకుని అభ్యర్ధుల ఆసక్తిని గమనించి స్థానిక సంస్థల ప్రతినిధి గా గెలిచిన అనుభవం ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయతీ లకు బడ్జెట్ లో నేరుగా 50 శాతం నిధులు కేటాయించి సర్పంచులను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. విధులు, నిధులు, అధికారాలతో పాటు బడ్జెట్ లో సింహ భాగం పంచాయతీ లకు నిధులు కేటాయించి దేశంలో నే ఆదర్శ ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి ముందు వరుసలో నిలబడాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ కోరుకుంటుంది అని మండిపాల్ వెంకట్ అన్నారు.గ్రామాలలో గ్రామ ప్రజలు సర్పంచులుగా,వార్డు మెంబర్లుగా గెలిపించినందుకు గ్రామంలో ప్రజలకు ఏదోఒకటి చేయాలనే ఉద్దేశంతో సర్పంచులు అభివృద్ధి పనులు పూర్తి చేస్తే నేటికి బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకొన్న సంఘటనలు ఎన్నో గత అనుభవాలు ఉన్నాయి.అయినా నేటికి ఇంకా పాత సర్పంచులకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి అన్నారు.ఇలాంటి దుస్థితికి నేటి నూతనంగా ఎన్నికైన సర్పంచులకు రాకుండా చూడాల్సిన భాధ్యత ప్రభుత్వం పై ఉందని తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మండిపల్ వెంకట్ అన్నారు.

## గురువుల ఆశీర్వాదం తీసుకున్న నూతన సర్పంచులు, ఉప సర్పంచ్లు..

**షాద్‌నగర్, డిసెంబరు 26, ప్రభాతవార్త** : ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచులుగా ఉపసర్పంచులుగా ఇతర హోదాలలో గెలుపొందిన తన కళాశాలలో చదువుకున్న శిష్యులను సన్మానించిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ టీ. కరుణాకర్. ఈ సందర్భంగా వారికి సూచనలు చేసిన సీనియర్ కాంగ్రెస్ లీడర్ బాదేపల్లి సిద్దార్థ. తరగతి గదిలో బోధనలు నేర్పిన గురువు ప్రస్తుత మార్కెట్ కమిటీ డైరెక్టర్ టీ. కరుణాకర్ నూతనంగా ఎన్నికైన సర్పంచులు మరియు డిప్యూటీ సర్పంచులను తన ఇంటికి రప్పించుకొని ఆదిత్యం ఇచ్చి వారిని సన్మానించి గ్రామ సర్పంచులు గా ఎన్నికైన మీరు గ్రామంలో కుల మత వర్గ బేధం లేకుండా అందరినీ సమాన దృష్టితో, ప్రజా సేవతో గ్రామంలోని సమస్యలు తీర్చి, గ్రామంలోని యువతను, మహిళలు మరియు వృద్ధులను వారిపై ప్రత్యేక దృష్టి వహించి సమస్యలు పరిష్కరించాలని. గ్రామంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనల దిశగా అవకాశం కల్పించి ప్రోత్సహించాలని, గ్రామంలో తాగునీరు సాగునీరు పారిశుధ్య వ్యవస్థను అందుబాటులో ఉంచాలని, గ్రామీణ విద్యను పటిష్ట పరచాలని, గ్రామంలో బెల్ట్ షాపులను బందు చేయించాలని, చెడు దారిలో వెళ్తున్న యువతను సన్మార్గంలో నడిపించాలని. నేటి సమాజానికి అనుకూలంగా సాంకేతికపరమైన అవసరాలు ఏమైనా వాటిని సమకూర్చుకోవాలని మరుదప ఎలక్షన్ల వరకు మంచి పేరు తెచ్చుకోవాలని ప్రజల ప్రేమాభిమానాలతో గెలవాలని, మద్యము బిర్యాని పైసలకు ప్రజలను బానిసలను కాకుండా అభివృద్ధికి పట్టం కట్టే వారిగా వారిని తీర్చిదిద్దాలని, మానవసేవయే మాధవ సేవగా భావించి మీ యొక్క విధులను నిర్వహించాలని గురువుగా ఉపదేశం చేశారు. సన్మాన గ్రహీతలు సర్పంచులుమూడవ శ్రీను నాయక్, సర్పంచ్( దేవుని బండ తండా). నరేష్ రానా, సర్పంచ్ ( చింతగూడెం), గోపాల్ రెడ్డి, సర్పంచ్ (అయ్యావారిపల్లి),లలిత మల్లేష్ ,సర్పంచ్ (దేవునిపల్లి), పావని శివ మొగిలి, సర్పంచ్( చెగిరెడ్డి ఘనపూర్),వేణు సర్పంచ్( వీరన్న పల్లి బాలనగర్), ఉప సర్పంచ్లు అమీర్ ఉపసర్పంచ్( నిడద వెళ్లి).బాదావత్ శ్యామ్ లాల్ ఉప సర్పంచ్( దేవుని బండ తండా)శ్రీను నాయక్ ఉప సర్పంచ్ ( తూర్పు గడ్డ తండా), రాజు నాయక్ ఉప సర్పంచ్( గిరాయి గుట్ట తండా), ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బూర్గుల రఘు, రాము గోర్ల, పోమాల పద్మారావు తదితరులు ఉన్నారు.


గురువులను సత్కరిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్ లు

## ఘనంగా సిపిఐ శతాబ్ది ఉత్సవాలు..

**చేవెళ్ల, డిసెంబరు 26, ప్రభాతవార్త** : సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ చేవెళ్ల మండల కేంద్రంలో ఘనంగా సిపిఐ యొక్క జెండాను సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆవిష్కరించారు ఈ సందర్భంగా సిపిఐ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు రైతు సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎం ప్రభు లింగం సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు సుదీర్ఘకాలం దేశంలో అనుగారిన వర్గాలకు హక్కుల కోసం దేశ స్వతంత్రం కోసం దేశ స్వతంత్రం పోరాటం లో అనేక త్యాగాలు చేసిన పార్టీ దేశ స్వతంత్రం కావాలని బ్రిటిష్ వారు ఈ దేశం నుంచి వెళ్లిపోవాలని నిర్భయంగా పిలుపునిచ్చిన పార్టీ ఎర్రజెండా అని వారి సందర్భం కొనియాడారు స్వతంత్ర అనంతరం కూడా దేశంలో బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం వారికి నిరంతరం అండగా ఉంటూ వారి పక్షాన దున్నే వానికి భూమి అంటూ రాజభరణాలు రద్దు చేయాలని రద్దు చేయాలని పేద ప్రజలకు భూములు వంచాలని అదేవిధంగా తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం పోరాటంతో ఎదిరించి పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి 4000 గ్రామాలను విముక్తిని చేసి 4500 మందిని అమరవీరులను త్యాగం చేసే పార్టీ ఎర్రజెండా అని దేశ స్వతంత్రం వచ్చిన ఇప్పటివరకు స్వతంత్ర అనంతరం కూడా పేదల పక్షాన కార్మికుల రైతుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని రైతులకు తెచ్చిన నల్ల చట్టాలను పార్లమెంటులో రద్దుచేసి వారి పక్షాన పోరాడింద ని కార్మిక హక్కులకు లేబర్ కార్డు కల్పించి వారికి ఇబ్బంది కల్పిస్తున్నటువంటి మోడీ ప్రభుత్వాన్ని కార్మికుల పక్షాన పోరాటం చేసింది అని ఎర్రజెండా అని వారి సందర్భం కొనియాడారు జనవరి 18న జరిగే ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాల భారీ బహిరంగ సభ ముగింపు సభకు లక్షలాది మందితో జరుగుతున్న మహాసభను విజయవంతం చేయాలని ఈ మహాసభకు 5 లక్షల మంది వరకు దేశవ్యాప్తంగా తరలిరానున్నట్టు 42 దేశాల ప్రతినిధులు ఈ మాసభలో పాల్గొంటారని ఈ మాసములో జాతీయ నాయకులు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి గ్రామ గ్రామానికి కార్యకర్తలు వామపక్ష భావాలు గల నాయకులు హాజరుకావాలని వారి సందర్భంగా కోరారు గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను బలోపేతం చేయాలని బలోపేతం అయ్యున్నాడే గ్రామాలలో అన్యాయాల పైన పోరాటాలు చేస్తామని వారి సందర్భం తెలియజేశారు ఈ కార్యక్రమంలో బి కే యం జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎం సుధాకర్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏఐటీసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ ఇన్సప్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బుల్ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల మొయినాబాద్ మండల కార్యదర్శి కే శీను చేవెళ్ల మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి షాబాద్ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం మాజీ శాపాద్ మండల కార్యదర్శి నక్క జంగయ్య తరపు పాల్గొన్నారు

### అలుపెరుగని పోరాటాలతో శత వసంతాలు పూర్తి చేసుకున్న కమ్యూనిస్టు పార్టీ

**షాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త** : అనార్థులకు, అభాగ్యులకు నీడనిచ్చి, బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచి, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ నేటికి 100 సంవత్సరాల శత వసంతాలు పూర్తిచేసుకుని నింగిలో అరుణ కిరణముల కమ్యూనిస్టు పార్టీ వెలుగొందుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా షాబాద్ మండల పరిధిలోని నాగరకుంట, షాబాద్, కురువగూడ, మన్మర్రి గ్రామాల్లో శుక్రవారం సిపిఐ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన పార్టీ జెండాలను ఎగురవేసి శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అనార్తులు, అభాగ్యుల కోసం ఏర్పడిన పార్టీ సీపీఐ పార్టీ అని, నాడు పార్టీ ఏర్పడిన తొలి నాళ్లలో రాజులకు, రాజరిక వ్యవస్థలకు, బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా జాతీయ ఉద్యమంలో కమ్యూనిస్టులు పాల్గొన్నారని తెలిపారు. జాతీయత భావాలతో అలుపెరుగని ఉద్యమాలు నిర్వహించిన గొప్ప చరిత్ర కమ్యూనిస్టు పార్టీ ద అని, నాడు జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో వేలాది గ్రామాలను విముక్తి చేసి లక్ష ఎకరాల భూములు ప్రజలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అని తెలిపారు. భూమి, బుక్తి, విముక్తి పోరాటాలు ఎన్నో భారతదేశవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కావాలని, ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేయించి భూ పోరాటాలు నిర్వహిస్తున్న పార్టీ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి గడ్డమీద నరసింహులు, మాజీ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, నాయకులు రఘురాం, నారాయణ, మధు, రమేష్, రాములు, రామకృష్ణ, వెంకటేష్, శ్రీను, రుక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.


కురువగూడలో సిపిఐ పార్టీ జెండాను ఎగరవేస్తున్న జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య.

## ఘనంగా శివారెడ్డికి నివాళులు


శివారెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**ఘట్‌కేసర్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసీ ఘట్‌కేసర్ సర్కిల్ శివారెడ్డిగూడలో శుక్రవారం భూదాత స్వర్గీయ కొంతం శివారెడ్డి 39వ వర్ధంతిని నిర్వహించారు. శివారెడ్డిగూడకు భూమి దానం ఇచ్చిన భూదాతగా స్థానికులు ఆయనను పిలుస్తారు.

ఈసందర్భంగా శివారెడ్డి విగ్రహానికి ఆయన మనువండ్లు పూలమాళ వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు కొంతం రాంరెడ్డి, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, కొంతం నర్సింహ్మారెడ్డి, బద్దం కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.


దివ్యాంగులకు ట్రై సైకిళ్ళను అందిస్తున్న దృశ్యం

## దివ్యాంగులకు ట్రై సైకిళ్ళ పంపిణీ

**కొడంగల్,డిసెంబరు 26, ప్రభాతవార్త** : యూత్ ఫర్ సేవా వారి సహకారంతో తెలంగాణా విద్యావంతుల వేదిక అద్వర్యంలో కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని పాతకొడంగల్ గ్రామానికి చెందిన దివ్యాంగులైన భీమేష్,ఆశప్పలకు శుక్రవారం ట్రై సైకిళ్ళు అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణా విద్యావంతుల వేదిక,రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ యూత్ ఫర్ సేవా సహకారంతో తెలంగాణా విద్యావంతుల వేదిక అద్వర్యంలో 2009 నుండి విద్యావ్యవస్దలో అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.అలాగే రైతు ఆత్మహత్య కుటుంబాలకు సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో పాతకొడంగల్‌కు చెందిన ఆశప్ప,భీమేస్‌లకు ఐదు సంవత్సరాల క్రితం వారి ఇంటిని సందర్శించి వారి అవసరాల నిమిత్తం నేడు ఆర్దిక సహయ సహకారం అందిస్తు నిత్యవసర సరుకులను అందజేస్తు వారు కదలేనటువంటి స్దితిలో ఉన్నందున జన్మనిచ్చిన తల్లిదండ్రులకు భారం కాకుడదనే ఉద్దేశ్యంతో వారికి ట్రై సైకిళ్ళను అందించడం జరిగిందన్నారు.ప్రభుత్వం కూడా ఇలాంటి దివ్యాంగులకు ఆర్దిక సహయంతో పాటు జీవనోపాధి కార్యక్రమాలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకారం చంద్రశేఖర్,జిల్లా కన్వీనర్ గౌరారం గోపాల్,ఎస్టీయూ ప్రధాన బాధ్యులు వేణుగోపాల్,అమ్మానాన్న ఫౌండేషన్ వ్యవస్దాపకులు ప్రవీణ్,బొంకురు నరేష్‌కుమార్,మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ చాళుక్య శిల్పాలను కాపాడుకోవాలి

..కొడంగల్‌కు వేయ్యేళ్ల చరిత్ర..పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

**కొడంగల్,డిసెంబరు 26, ప్రభాతవార్త** : కొడంగల్ పట్టణంలోని కమాన్ ముందుగల ఎడమవైపు వీధిలో కళ్యాణ చాళుక్యుల కాలపు(సా.శ.10వ శతాబ్ది) శిల్పాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా.ఈమని శివనాగిరెడ్డి అన్నారు.స్దానిక శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించిన సందర్బంగా నిర్లక్ష్యంగా పడి ఉన్న నాగదేవత,వీరులు,నంది శిల్పాలను ఆయన పరిశీలించారు.సర్పాలతో పాటు కుడి చేతిలో ఖడ్గం,ఎడమ చేతిలో డాలు,తలపై కిరీటం ధరించి నడుము నుంచి కింద సర్పము,పైన దేవతల ఆకారాన్ని కలిగి ఉన్న నాగదేవతలు,చేతిలో ఈటలు ధరించి పులిని చంపుతున్న తల లేని వీరుని శిల్పం,వంటిపైన గంటల పట్టెడ ధరించి చిన్నమోపురంతో తలలేని నంది,మరో వీరిని నల్ల శాసనపు రాతిలో చెక్కిన శిల్పాలు కొడంగల్‌లో వేయ్యేళ్ళ నాటి నాగదేవత ఆరాధన,పెద్దపులి దాడి నుంచి గ్రామాన్ని కాపాడిన వీరుని పట్ల గల గౌరవ భావాన్ని తెలియజేస్తున్నాయని ఆయన అన్నారు.ఈ శిల్పాలు అలనాటి సాంస్రృతికి చిహ్నాలు అని కొడంగల్ పట్టణానికి వేయ్యేళ్ళ చరిత్ర ఉందని తెలియజేసే అనవాళ్ళని,వీటిని భవిష్యత్ తరాలకు అందించాలని ఆలయ ధర్మకర్తలు నందారం ప్రశాంత్, శ్రీనివాస్ ,రత్నం,లక్ష్మీనారాయణకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ స్దపతి మత మూర్తి రూపశిల్పి,డిఎన్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.


కొడంగల్‌లో కళ్యాణ చాళుక్య శిల్పాలను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు



మహరాజ రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ రాజేందర్, డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్

## వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**ఘట్‌కేసర్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** వినియోగదారులకు మెరుగైన ఆహార సేవలు అందిస్తే మంచి ఆధరణ లభిస్తుందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో జరిగిన మహరాజ హోటల్ ప్రారంభోత్సవంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని రిబ్బన్ కత్తిరించి హోటల్‌ను ప్రారంభించారు. బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గుండ్ల బాల్‌రాజ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పాత రాఘవేంద్ర హోటల్‌లో మహరాజ రెస్టారెంట్ పేరుతో నూతనంగా వెజ్/నాన్‌వెజ్ ఆహార కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. హోటల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎంపీ రాజేందర్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులకు బాల్‌రాజ్ మిఠాయి తినిపించి శాలువాలతో సన్మానించారు. దేశానికి సుస్థిర పాలన అందించిన అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి జాతీయ సుపరిపాలనా దినోత్సవం రోజున బాల్‌రాజ్ హోటల్‌ను ప్రారంభిస్తుండటంతో ఆయన అభివృద్ధి చెందాలని ఎంపీ ఈటల ఆకాక్షించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ గుండ్ల కృష్ణవేణి, మున్సిపల్ కాంగ్రెస్, బిజెపి అధ్యక్షులు మామిండ్ల ముత్యాల్‌యాదవ్, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మండల బిజెపి అధ్యక్షులు బసవరాజుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు గొంగళ్ల బాలేష్, జిల్లా కార్యదర్శి విప్పర్ల హనుమాన్, మాజీ ఎంపిటిసి వెంకట్‌రెడ్డి, కొమురవెల్లి డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు, మాజీ వార్డుసభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## పేదల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాటాలు

**శామీర్‌పేట, డిసెంబరు 26, ప్రభాతవార్త:** పేదల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాటాలు చేస్తుందని, కమ్యూనిస్టు పార్టీకి, ఉద్యమాలకు వందేళ్లు నిండినట్లు సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డిజి సాయిలుగౌడ్ పేర్కొన్నారు.

శుక్రవారం శామీర్‌పేట పెద్దమ్మ కాలనీలో సిపిఐ పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దమ్మ కాలనీ ధర్మబిక్షం స్థలం వద్ద సిపిఐ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. మండల సిపిఐ కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ అధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగ సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ గడిచిన వందేళ్లలో ప్రజల శ్రేయస్సు కోసం, సమస్య పరిష్కారం కోసం పోరాడుతూ వస్తుందన్నారు. ప్రజల జీవన విధి విధానాలపైన అనేక సమస్యలపైన కార్మిక, కర్షక, అసంఘటిత రంగాల ప్రజల మెరుగైన జీవనం కోసం సుధీర్ఘ పోరాటాలు పార్టీ చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యానికి మూలస్థంభాలుగ ఉన్న రాజకీయ రంగం, న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ, వార్త ప్రతిక రంగాలు ప్రజల న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం ఉన్నాయని మండల పార్టీ కార్యదర్శి నరేంద్రప్రసాద్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాజకీయ శక్తిగా ఎదిగి ప్రజల్లో ఉంటుందన్నారు. ప్రజల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సంఘటితం కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట గ్రామ సిపిఐ కార్యదర్శి డి.భూమయ్య, నాయకులు ఎస్.రమేష్, గాయత్రి, వసంత జీవన్, ప్రధాన్, దిగంబర రాజు పి.రాణి, లక్ష్మీదేవిలు పాల్గొన్నారు.


శామీర్‌పేటలోని పెద్దమ్మ కాలనీ వద్ద సిపిఐ జెండాను ఆవిష్కరించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డిజి సాయిలుగౌడ్,పాల్గొన్న నాయకుల దృశ్యం

## కాంగ్రెస్‌లో చేరిన తాండ సర్పంచ్


కాంగ్రెస్‌లో చేరిన దీప్లనాయక్ అంజలి భరత్ నాయక్

**కుల్కచర్ల డిసెంబరు 26 ప్రభాతవార్త:** వెనుకపడ్డ గ్రామాలను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో దీప్లనాయక్ గ్రామ పంచాయతీ నుండి అంజలి భరత్ నాయక్ ఇండిపెండెట్‌గా పోటీచేసి సర్పంచ్‌గా గెలుపొందారు. శుక్రవారం కుల్కచర్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కాండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నూతన సర్పంచ్‌గా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కొరకు కృషి చేస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిపి సత్యహరిచందర్, రవి నాయక్ తదిరులు పాల్గొన్నారు.

## సిఎం సలహాదారును కలిసిన ఎమ్మెల్యే సోదరుడు

**తాండూరు, డిసెంబరు 26, ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డి ప్రజావ్యవహారాల సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడు, ఆర్బీవోఎల్ సిఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసం లో సుమారు 15 నిముషాలపాటు భేటీ జరిగింది. తాండూరు ప్రాంత రాజకీయాలు, ఇటీవల గెలుపొం దిన సర్పంచ్‌ల గురించి చర్చించారు. కొత్త గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటా యిస్తుందని నరేందర్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వం విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, రోడ్లు, మంచినీరు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.


నరేందర్‌రెడ్డిని కలిసిన బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి

## హత్య కేసులో నిందితుల రిమాండ్

**తాండూరు, డిసెంబరు 26, ప్రభాతవార్త :** హత్య కేసులో ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. తాండూరు పట్టణ శివారులోని రాజీవ్‌కాలనీ వద్ద గురువారం జరిగిన సంఘటనలో పోలీసులు రాత్రికి రాత్రే నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రాజీవ్‌కాలనీ వద్ద కిట్టూ అనేక యువకుణ్ణి తరుముకుంటూ వచ్చిన ఖాంజాపూర్ గ్రామానికి చెందిన మద్దూరు గోపాల్, ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎస్. ఆదర్శ్, ఖాంజాపూర్‌కు చెందిన మద్దూరు అనిల్, కుర్వ ప్రవీణ్, ఇందిరమ్మ కాలనీకి చెందిన చిన్నగాళ్ల కృష్ణ, రాజీవ్‌కాలనీకి చెందిన హన్మంత్‌పూర్ ప్రశాంత్‌రెడ్డిలు మాంసం దుకాణం యజమాని నూర్ ఆహ్మద్ ఖురేషీ (60)పై కత్తితో దాడికి పాల్పడ్డారు. తాము వెంటపడిన యువకుడు మాంసం దుకాణంలో దాక్కున్నాడని, అడ్డువచ్చిన ఖురేషీని అతని తనయుడు అబ్బు సూఫియాన్‌పై కత్తిపోట్లకు పాల్పడ్డారని జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా ఖురేషీ మృతిచెందారు. ఎ-1 నిందితునికి మిగిలిన వాళ్లు సహకారించారని, వారందరినీ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ కేసును ఛేధించడంలో కృషి చేసిన అదనపు ఎస్పీ రాములు నాయక్, డిఎస్పి నర్సింగ్ యాదయ్య, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్‌కుమార్, సంతోష్‌కుమార్, ఎస్సై విఠల్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు దస్తప్ప, ప్రతాప్, మున్నయ్య, శివ, అంజాద్‌లను ఆమె అభినందించారు. వారికి రివార్డు ప్రకటించారు.

## సర్పంచ్‌గా గెలిచిన తోటి మిత్రుడు.. సన్మానించిన క్లాస్‌మేట్స్

**కుల్కచర్ల, డిసెంబరు 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కుసుమ సముద్రం గ్రామం నుండి గందే ప్రవీణ్ కుమార్ బిఆర్ఎస్ పార్టీ నుండి సర్పంచ్ గెలుపొందారు. కుల్కచర్ల గ్రామ వార్డు సభ్యులుగా ఎం. వెంకటేష్ గెలుపొందాడు. సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించడంతో శుక్రవారం చిన్ననాటి మిత్రులు ప్రవీణ్ కుమార్‌ను ఎం. వెంకటేష్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తమతో చదువుకున్న మిత్రుడు సర్పంచ్‌గా విజయం సాధించడంతో సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి నిరంతం కృషిచేస్తామని మిత్రులతో ఈ సందర్భంగా వెల్లడించాడు.


సర్పంచ్‌గా గెలుపొందిన వారిని సన్మానిస్తున్న మిత్రులు

## అందరూ ఆహ్వానితులే..!

### నేడు అయ్యప్ప దేవాలయంలో మహా పడిపూజ

**నందిగామ డిసెంబరు 26 ప్రభాత వార్త:** నందిగామ మండల కేంద్రంలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో 27 వ తేదీ శనివారం సాయంత్రం 7 గంటలకు అయ్యప్ప స్వామి మహా పడి పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జిల్లెల్ల బాల్ రెడ్డి తెలిపారు. ఈ వేడుకల్లో ఆలయ ప్రాంగణంలో గురుస్వామి గిరీష్ నాయర్ ఆధ్వర్యంలో జరిగే ఈ మహా పడిపూజ కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల్లో ఉన్న అయ్యప్ప భక్తులు, పుర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు అందరూ హాజరై స్వామివారి కృపకు పాత్రులై విజయవంతం చేయాలని కోరారు.

## అధైర్యపడకు ..అండగా ఉంటాం

### శబరిమలలో తప్పి పోయిన శ్రీను నాయక్ కుటుంబానికి ధైర్యం చెప్పిన సర్పంచ్ గబ్రు

**నందిగామ డిసెంబరు 26 ప్రభాత వార్త:** శబరిమలలో ఈ నెల 21 వ తేదీన తప్పి పోయిన జెటావత్ శ్రీనునాయక్ కుటుంబ సభ్యులను శుక్రవారం ఉదయం సిడితండా సర్పంచ్ ముడావత్ గబ్రుచౌహాన్ తాటిగడ్డ తండాకు వెళ్లి శ్రీను నాయక్ తల్లి జెమినినీ, కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. అయ్యప్ప ఆశీస్సులతో శ్రీను క్షేమంగా ఇంటికి తిరిగి వస్తాడని , అధైర్య పడొద్దు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గతంలో అదే తండాకు చెందిన రూప్‌సింగ్ అనే వ్యక్తి శబరిమలలో తప్పిపోయి నెలరోజుల తర్వాత కుటుంబ సభ్యులు వెళ్లి తీసుకొచ్చిన సంఘటనలు లేకపోలేదు. ఏది ఏమైనా కుమారుడి బెంగతో జెమిని మంచం పట్టింది.


అనురాగ్ యూనివర్శిటీలో నిర్వహించిన జీరో డే సీటీఎఫ్ సైబర్ సెక్యూరిటీ విభాగపు కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు.

## అనురాగ్ యూనివర్శిటీలో జీరోడే సీటీఎఫ్ సైబర్ సెక్యూరీటీ హ్యాకథాన్

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 26, ప్రభాత వార్త:** వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో సమాచార సాంకేతిక సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జీరో డే సీటీఎఫ్ సైబర్ సెక్యూరిటీ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వైవి. రెడ్డి అన్నారు. క్యాప్చర్ ద ఫ్లాగ్ తొలిసారిగా నిర్వహించడం జరిగిందని అధ్యాపకులు, విద్యార్థుల నుండి మంచి స్పందన లభించిందని నిర్వహకులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అన్‌స్టక్ టెక్నాలజీస్ సీఈఓ వి. అనిరుధ్ మాట్లాడుతూ జీరో డే సీటీఎఫ్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు వాస్తవ ప్రపంచ సైబర్ సవాళ్లపై అవగాహన పెంపొందించడమే కాకుండా సమస్య పరిష్కర సామర్థ్యం, టీమ్‌వర్క్ ఏథికల్ హ్యాకింగ్ విలువలను పెంపొందిస్తాయని అన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆవిష్కరణాత్మక ఆలోచనలను కల్గిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పివి. కుమార్, డాక్టర్ ప్రశాంత్‌రావు, విద్యార్థి కో ఆర్డినేటర్లు సాత్విక్, సాయికృష్ణ, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు జి. సాయికృష్ణ, మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 39 ఏళ్లుగా పడి లేస్తూ..

# నత్తనడకన సిసిఐ పరిశ్రమ

### సిమెంట్ ఉత్పత్తుల్లో డీలా
### పాత యంత్రాలతో సతమతం
### కేంద్ర ప్రభుత్వం అరకొర సహాయం
### ప్రైవేటుకు ధీటు గగనమే!


సిసిఐ కర్మాగారం




**ప్రభాతవార్త, డిసెంబరు 26 ,వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** మూడున్నర దశాబ్దాలుగా సిసిఐ పడి లేస్తూ నత్తనడకన ముందుకు సాగుతున్నది. సిమెంట్ ఉత్పత్తుల్లో మందగింపు వల్ల మార్కెట్లో ప్రైవేటు సంస్థలను ధీటుగా ఎదుర్కొనలేకపోతోంది. పాత యంత్రాలు, ప్రభుత్వ అరకొర సహకారం, కొత్త ఉద్యోగుల నియామకం లేకపోవడం వంటి కారణాల వల్ల సిసిఐ ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది.

1987లో కేంద్ర ప్రభుత్వం సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సిసిఐ)ను తాండూరు మండలం కరణ్‌కోటలో ప్రారంభించింది. ఈ ప్రాంతంలో అపారంగా ఉన్న సున్నపురాయి నిక్షేపాల వల్ల సిమెంట్ పరిశ్రమను స్థాపించింది. అప్పట్లో ఈ ప్రాంతంలో ఒక్క సిమెంట్ పరిశ్రమ కూడా లేకపోవడం గమనార్హం. దేశంలోని అస్సాంలోని బొకజాన్, ఛత్తీస్‌ఘడ్‌లోని అకల్తారా, మంధర్, మధ్యప్రదేశ్‌లోని నయాగావ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని



రాజ్‌బన్, హర్యానాలోని చార్ఖీ దాద్రి, కర్నాటకలోని కురుకుంట, తెలంగాణలోని తాండూరు, ఆదిలాబాద్‌లో సిసిఐ పరిశ్రమలు నెలకొల్పారు. వాటిలో సగానికి సగం తరచూ తెరుచుకుంటూ, మూసుకుంటూ పని చేస్తున్నాయి. కర్నాటకలోని కురుకుంటలో చాలాకాలంగా మూత పడింది. తాండూరు పరిశ్రమ కూడా తరచూ ఉత్పత్తులను నిలిపివేయడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం ఉత్పత్తులు నిరాటంకంగా సాగిస్తున్నా అనేక ఇబ్బందులతో పరిశ్రమ మనుగడ సాగుతోంది. సిసిఐ రెండు బ్రాండ్లను మార్కెటింగ్ చేస్తోంది. అందులో పోర్ట్ ల్యాండ్ పోజోలానా (పిపిసి), ఆర్డినరీ పోర్ట్ ల్యాండ్ సిమెంట్ (ఓపిసి) బ్రాండ్ల ఉత్పత్తులు జరుగుతున్నాయి.

మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన సిసిఐలో చాలావరకు పాత యంత్రాలతోనే ఉత్పత్తులు చేపడుతున్నారు. లోగడ పలుమార్లు కొత్త పరికరాలు వచ్చినా ప్రైవేటు సిమెంట్ సంస్థలకు ధీటైన యంత్ర పరికరాలు రావడం లేదని తెలుస్తున్నది. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో ఉన్నందున పూర్తిస్థాయి ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. మార్కెట్లో అనేక ప్రైవేటు సంస్థలు పుట్టుకొచ్చాయి. ఈ రంగాన్ని ధీటుగా ఎదుర్కొనేందుకు సరిపడా నైపుణ్యం, యంత్రాలు, కొత్త ఉద్యోగులు అవసరమని భావిస్తున్నారు. ఈ పరిశ్రమలో రోజు వారి సామర్థ్యం 3 వేల టన్నుల సిమెంట్ ఉత్పత్తి ఉన్నది. అయితే, నెలకు 15 రోజులు మాత్రమే ఉత్పత్తులు చేపడుతున్నారు. రోజూ 1500 టన్నులు మార్కెటింగ్ అవుతోందని సమాచారం. నిర్ణీత సామర్థ్యం కంటే సగానికి సగం తగ్గిపోయింది. అదే ప్రైవేటు పరిశ్రమల్లో రోజుకు 10 వేల టన్నుల సిమెంట్ ఉత్పత్తులు సాగుతున్నాయి. తాండూరు పరిసరాల్లోనే అనేక ప్రైవేటు పరిశ్రమలు ఉత్పత్తులు భారీగా చేపడుతున్నాయి. కర్నాటక సరిహద్దులో మరో రెండు పరిశ్రమలు ఉన్నాయి. వాటికి ధీటైన సమాధానం ఇవ్వాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం ఒక్కటేనని కార్మికులు, ఉద్యోగులు అంటున్నారు. మార్కెట్లో సిసిఐ బ్రాండ్ల ఉత్పత్తులకు బస్తా ధర రూ.250 నుంచి 270 రూపాయల వరకు పలుకుతున్నాయి. రైల్వే స్లీపర్లకు కూడా ఇక్కడే తయారవుతున్నాయి. ప్రైవేటు సంస్థల కంటే రూ.10 తక్కువగా కూడా విక్రయిస్తున్నారు.

పాత సాంకేతిక పరిజ్ఞానం, పాత యంత్రాలతో సతమతం అవుతున్నారు. సిమెంట్ మిల్లు, ప్యాకింగ్ ప్లాంటు, బొగ్గు మిల్లు పాత పరిజ్ఞానంతోనే తయారు చేశారు. ఇప్పటికీ వాటినే ఉపయోగిస్తున్నారు. వీటి స్థానంలో కొత్త వాటిని అమర్చాలని కార్మికులు కోరుతున్నారు. పాత టెక్నాలజీ వల్ల విద్యుత్ వినియోగం అధికం అవుతున్నది. విద్యుత్ కూడా భారంగా మారింది. దాంతో పాటు సిమెంట్ తయారీకి ఉపయోగించే బొగ్గును కేంద్ర ప్రభుత్వమే సరఫరా చేయాలని అంటున్నారు. ప్రస్తుతం సింగరేణి నుంచి సరఫరా చేస్తున్నారు.

ఇది చాలా ఖరీదు అవుతోందని చెబుతున్నారు. నెలకు 4 ర్యాక్ (రైలు ద్వారా సరఫరా) అవసరమవుతున్నాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించి కోల్ ఇండియా నుంచి యేటా 48 ర్యాక్‌లు పంపించాలని కోరుతున్నారు. మంచి క్వాలిటీ ఉంటుందని, ఖర్చులు కూడా తగ్గిపోతాయని అంటున్నారు. సింగరేణి నుంచి వచ్చే బొగ్గు తక్కువ గ్రేడ్ వస్తుందని తెలిపారు. ఆధునిక టెక్నాలజీ అమర్చితే తక్కువ విద్యుత్ వినియోగం, బొగ్గు ఖర్చులు తగ్గుతాయని అంటున్నారు. దానివల్ల సిమెంట్ ఉత్పత్తులు పెరగడం, ధరలు తగ్గడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటాయని కార్మికులు చెబుతున్నారు. అప్పుడే ప్రైవేటు రంగాన్ని ధీటుగా ఎదుర్కొంటున్నామని అంటున్నారు.

ఆరంభంలో నియమితులైన ఉద్యోగ, కార్మికుల్లో 90 శాతం మంది రిటైర్డ్ అయ్యారు. తాత్కాలిక వేతనంతో చాలామంది పని చేస్తున్నారు. కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులను సేవలను సిసిఐ ఉపయోగించుకుంటున్నది. కొత్త వారి నియమాకం చేపడితే సంస్థకు మేలు చేకూరుతుంది. సిసిఐకి యువరక్తం అవసరమని అంటున్నారు. సిసిఐ ఆధునీకరణకు రూ.100 కోట్లు కేంద్ర సహాయం అందిస్తే మరో ఐదేండ్ల పాటు మంచి లాభాలతో నడపవచ్చని చెబుతున్నారు. ఇటీవల కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామిని కలిసిన కార్మిక సంఘాల నేతలు వినతిపత్రం సమర్పించారు. మరి ఎప్పుడు కరుణిస్తారో వేచి చూడాలని సంఘాల ప్రతినిధులు అంటున్నారు.

# విద్యాసదస్సును విజయవంతం చేయండి

### బొడ్డుపల్లి రాములయ్య

**తలకొండపల్లి డిసెంబరు 26,ప్రభాత వార్త :** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టి. ఎస్. యు. టి. ఎఫ్. నిర్వహిస్తున్న రాష్ట్ర విద్యాసదస్సును విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి రాములయ్య మరియు తలకొండపల్లి మండల అధ్యక్షులు ఎం. విష్ణుమూర్తి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా సదస్సు గోడపత్రికను తలకొండపల్లి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ లక్ష్మి మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్జాల్ బాలురు ప్రధానో పాధ్యాయురాలు నసీమా సుల్తానా గారి చేతుల మీదుగా ఉన్నత పాఠశాల ఆవరణలో ఆవిష్కరింపజేశారు. రాష్ట్ర విద్యా సదస్సు డిసెంబర్ 28, 29 తేదీలలో కామ్రేడ్ సయ్యద్ జియావుద్దీన్ ప్రాంగణం, కామ్రేడ్ రావెళ్ల రాఘవయ్య వేదిక,మాంగల్య ఫంక్షన్ హాల్ హైదరాబాద్ రోడ్ జనగామలో నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. 28 డిసెంబరు జనగాం లో ఉదయం ఉపాధ్యాయుల మహా ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు. ఒకరి కోసం అందరూ అందరి కోసం ఒక్కరు అనే నినాదంతో ఉపాధ్యాయులు అందరూ తమ సమస్యల పరిష్కారానికి అత్యధిక సంఖ్యలో




పాల్గొని విద్యాసదస్సును విజయవంతం చేయాలని ఆయన అన్నారు. విద్యా సదస్సులో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కొరకు, రాష్ట్ర విద్యా సదస్సు చర్చిస్తుందని అన్నారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో తలకొండపల్లి కోశాధికారి జె యాదయ్య సోషల్ మీడియా కన్వీనర్ కే మనోజ్ కుమార్, రమేష్ ఐలయ్య లతా శ్రీజ తదితరులు


గుండె ఆపరేషన్ కు 25వేల రూపాయల చెక్కు అందజేస్తున్న నాయకులు

## గుండె ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

**తలకొండపల్లి డిసెంబరు 26, ప్రభాతవార్త:** అభం శుభం తెలియని చిన్నారి కుమారునికి ఊహించని వ్యాధి రావడంతో ఆర్థిక స్థోమత లేక అనేక ఇబ్బందులకు గురయ్యారు. తలకొండపల్లి మండల పరిధి లోని అంతారం గ్రామానికి చెందిన ఆంజనేయులు గౌడ్ 11 నెలల కుమారునికి గుండె ఇబ్బందులతో బాధపడుతున్నారు. దీంతో ఆపరేషన్ నిమిత్తం అధిక డబ్బు ఖర్చు కావడంతో రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ , తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ను కలిసి తెలపడంతో స్పందించిన ఉప్పల వెంకటేష్ తను వ్యక్తిగతంగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో చిన్నారి తండ్రి ఆంజనేయులు గౌడు కు 25వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి , మాజీ సర్పంచ్ రాములు, శీను నరేష్ గౌడ్ వెంకటయ్య లక్ష్మయ్య మహేష్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐకి 100సంవత్సరాలు

**జిల్లేడు చౌదరిగూడ, డిసెంబరు 26,(ప్రభాతవార్త):** భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావించి వంద సంవత్సరాలు పూర్తి అయిందని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య అన్నారు. శుక్రవారం జిల్లేడు చౌదరిగుడా మండల కేంద్రంలో జండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ భారత గడ్డపై భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కి 100 సంవత్సరాలు పూర్తి అయి 101 అడుగుపెడుతున్న సందర్భం ఇది అని అన్నారు. ఈ 100 సంవత్సరాల కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొందని తెలిఎపారు. భారత స్వతంత్ర్య పోరాటంలో ముఖ్య భూమిక పోషించి అనేక విరోచిత పోరాటాలు నడిపిందని అన్నారు. సర్దార్ భగత్ సింగ్ సుఖ్ దేవ్ లాంటి అనేకం యువ కిశోరాలు విప్లవ వీరులు ప్రాణాలర్పిస్తే భారతదేశానికి స్వతంత్రం వచ్చిందని ఆయన కొనియాడారు. స్వతంత్రం తర్వాత భారతదేశ వ్యాప్తంగా భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల బానిసత్వాల విముక్తి కోసం పశ్చిమ బెంగాల్ ,కేరళ, తెలంగాణ రాష్ట్రాలలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి లక్షలాదిఎకారాల భూములు పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని ఆయన తెలియజేశారు. రజాకాలకు వ్యతిరేకంగా జాగీర్ దార్లకువ్యతిరేకంగా జమీందారులకు వ్యతిరేకంగా పోరాటాలు నడిపి తెలంగాణ ప్రాంతంలో సాకలి ఐలమ్మ దొండు కొమరయ్య మద్దుమ్ మొయినోదీన్ నారాయణరెడ్డి బద్దం ఎల్లారెడ్డి లాంటి అనేక వీరుల సాయుధ పోరాట ఫలితంగా తెలంగాణ నవాబు గద్దెదిగి తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేసిన పరిస్థితి అనితెలిపారు. చరిత్రలేని పార్టీలెన్నో భారతదేశంలో అధికారాల్లోకి వచ్చాయి కనుమరుగయ్యాయి సిపిఐ పార్టీ మాత్రం నేటికీ అధికారం ఉన్న లేకపోయినా ఎర్రజెండా నీడలో పేద ప్రజలకు



జెండావిష్కరణ చేస్తున్న సిపిఐ నాయకులు

కూడు గూడు నీడ చదువులు ఉద్యోగాలు ఉపాధి అన్ని సమస్యలపై పోరాటాలు నిర్వహించి పేద ప్రజల మన్నలు పొందిన పార్టీగా పేరొందిదని అన్నారు. జనవరి 3 తేది నుంచి 4 తేది వరకు షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచార జీపీ జాతలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు..అలాగే జనవరి 18న చలో ఖమ్మం భారీ బహిరంగ సభ ఉంటుందని ఆ బహిరంగ సభకు 40 దేశాల ప్రతినిధులు దేశవ్యాప్తంగా ప్రజలు తరలివస్తున్నారని బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షులు ఎండి షబ్బీర్, మిటమిన్స్ యూనియన్ మండల అధ్యక్షులు ఎండి చోటేమియా సిపిఐ మండల నాయకులు చిన్నయ్య, రాములు, మాణిక్యరావు, జంగమ్మ, చంద్రమ్మ, బుచ్చయ్య, కిషోర్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్ పాలక మండలి సభ్యులను సన్మానించిన మైనార్టీలు

## సర్పంచ్ పాలక మండలి సభ్యులను సన్మానించిన మైనార్టీలు

**నందిగామ, డిసెంబరు 26, ప్రభాత వార్త:** నందిగామ మండల కేంద్రంలో శుక్రవారం కొత్తగ గెలిచిన సర్పంచ్ కొమ్ము కృష్ణ,ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డ్ సభ్యులను మైనారిటీ సీనియర్ నాయకులు షేక్ హకీమ్ ,అబ్దుల్ గనిల ఆధ్వర్యంలో సర్పంచ్ పాలక మండలిని సన్మానించారు, అంతకుముందు గ్రామంలో ఉన్న మజీద్ వద్ద చాదర్ల కప్పి ప్రార్థనలు చేయించారు. అనంతరం తేనేటి విందులో సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్ పలువురు రాజకీయ ప్రముఖులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు , , శివ గళ్ళ సురేష్, శివగళ్ళ ప్రవీణ్ ,అగ్గిప్రసాద్ , జహీరుద్దీన్ ,నాయకులు షేక్ హకీమ్, అబ్దుల్ గని, నాయకులు ఎర్రగారి రమేష్, పబ్బతి కర్ణాకర్, అంతయ్య

# బెల్టు షాపులను తొలగించండి

### కొందుర్గును బెల్టుషాపుల రహిత గ్రామంగా తీర్చిదిద్దండి
### సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు వినతిపత్రం

**కొందుర్గు, డిసెంబరు 26,(ప్రభాతవార్త):** కొందుర్గు మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులను వెంటనే తొలగించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, ఉప సర్పంచ్ చిప్ప చంద్రశేఖర్‌లకు శుక్రవారం వినతిపత్రం అందజేచేశారు. లైసెన్స్ లేకుండా నడుస్తున్న ఈ షాపుల వల్ల నకిలీ మద్యం సరఫరా, చట్టవిరుద్ధ కార్యకలాపాలు పెరుగుతున్నాయని ఆరోపణలు అనేకంగా ఉన్నాప్పటికి సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న బెల్టుషాపుల్లో ఉదయం 5 గంటలకు మద్యం తాగి చాలామంది కుటుంబాలను రోడ్డున పడేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలోని కిరాణ దుకాణాల్లో మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని వాటిని అడ్డుకోవాలని అనేక మార్లు ఎక్సైజ్, పోలీసులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతంలో గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసినప్పటికి అది అమలుకు నోచుకోలేదు. ముఖ్యమంత్రి బెల్టు షాపులు ఉండవద్దని చెబుతున్నా కొందరు పార్టీ నాయకుల అండతో అవి కొనసాగుతున్నాయని విమర్శలు గుప్పించారు. యువత తెల్లవారుజాము నుంచే బెల్టు షాపుల్లో లభించే మద్యం తాగి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి బెల్టుషాపులను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కావాలి వినోద్, మొద్దు సంతోష్, లింగం, మధు, నవీన్, ప్రశాంత్ రెడ్డి, మల్లేష్, శ్రీకాంత్, మర్రెడ్డి, ప్రేమ్ కుమార్, గోపాల్, నరేందర్, శ్రీశైలం, శరత్, ప్రవీణ్, శేఖర్, ముత్యాలు,



బెల్టుషాపులు తొలగించాలని వినతి పత్రం అందజేస్తున్న యువకులు

పురుషోత్తం రావు, శేఖర్, నరేందర్, లు పాల్గొన్నారు.

## పురుగులమందు సేవించి యువకుడు ఆత్మహత్య

**పూడూరు, డిసెంబరు 26, ప్రభాతవార్త :** గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి బెదిరించడంతో మనస్థాపంచెంది ఓయువకుడు పురుగుల మందుసేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం రాకంచెర్లలో చోటు చేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌రెడ్డి కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని రాకంచెర్ల గ్రామానికి చెందిన వర్యా రాఘవ (25)అనే యువకుడికి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించడంతో మనస్థాపంచెంది గురువారం రాత్రి పురుగుల మందు సేవించాడు.

ఈ విషయాన్ని గమనించిన మృతుడి బంధువులు చికిత్స నిమిత్తం వికారాబాద్ మిషన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి అన్న విఠల్ పిర్యాదుమేరకు చెన్‌గోముల్ పోలీసులు చేసునమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న పోలేపల్లి సర్పంచ్

**ఆమనగల్లు, డిసెంబరు 26, ప్రభాతవార్త** ఆమనగల్లు మండలం పోలేపల్లి గ్రామ సర్పంచ్ వెంకటయ్య తన అనుచరులతో కలిసి శుక్రవారం అధికార పార్టీలో చేరారు. హైదరాబాద్ నగరంలోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. సర్పంచ్ వెంకటయ్య తో పాటు పోలేపల్లి గ్రామానికి చెందిన100 మంది నాయకులను కూడా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన పట్ల ప్రజల్లో విశ్వాసం పెంపొందుతున్నందున ఇతర పార్టీల నేతలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన తెలిపారు. గ్రామాల అభివృద్ధి కొరకు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంతో కలిసి రావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. కార్యక్రమంలో నారాయణ, మాజీ ఉప సర్పంచ్ దారెడ్డి అంజన్ రెడ్డి, నూతన వార్డు సభ్యులు లక్ష్మీ దేవి, జ్యోతి సత్యం, నర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దారెడ్డి అభినవ్ రెడ్డి, అఖిల్ రెడ్డి, భగవాన్ రెడ్డి, సూర్య నారాయణ రెడ్డి, రవి ప్రకాష్, జగన్, సత్య నారాయణ, రాజు, ఈశ్వరయ్య, జంగయ్య, నర్సింహ, శ్రీశైలం, వెంకటేష్, నవీన్, జ్యోతి విజేందర్ రెడ్డి, సంధ్య మాధవ రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్ వెంకటయ్యకు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి